నవతరం
RNI NO. APTEL/2014/58326
తెలుగు దినపత్రిక
సంపుటి : -13 సంచిక : 104 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి
19-02-2026 గురువారం వెల : 1 /- పేజీలు : 4


# దాడులు అనధికారమా?
# అధికారికమా?



- డీటీ చెప్పారంటూ ఉద్యోగం చేస్తున్న ఎచ్చెర్ల ఆర్ఐ
- డీలర్ల నుంచి పిండేస్తున్నట్లు తీవ్ర ఆరోపణలు
- డీలర్లు కార్డుదారుల నుంచి కేజీ నుంచి రెండు కేజీల వరకు బియ్యం దోపిడి

(నవతరం ప్రతినిధి శ్రీకాకుళం)

సివిల్ సప్లై డీటీ ఆదేశాల మేరకు చేస్తున్నానంటూ ఎచ్చెర్ల మండలంలో ఆర్ఐగా పనిచేస్తున్న ఓ మహిళా ఉద్యోగి, శ్రీకాకుళం నగరంలో పీడీఎస్ బియ్యాన్ని పట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ పని మంచిదే కదా అని భావించవచ్చు. కానీ ఈ చర్యల వెనుక కూడా మతలబ్ ఉందన్న ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా వ్యాపారం చేస్తున్న వారిపై దాడులు చేసి, వారి నుంచి బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడం, కేసులు నమోదు చేయకపోవడం, కొన్ని సందర్భాల్లో డబ్బులు లంచాల రూపంలో తీసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఏది ఏమైనప్పటికీ పీడీఎస్ బియ్యంతో వ్యాపారం చేయడం తప్పే. అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. కానీ కొందరిపై మాత్రమే దాడులు చేసి, మరికొందరిపై జాలి చూపుతున్నట్లు బాధిత వ్యాపారులు ఆరోపిస్తున్నారు.
కొన్ని సందర్భాల్లో కేసులు నమోదు చేయకుండా వదిలేస్తున్నారని, అప్పుడప్పుడు డబ్బులు గుంజుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై సంబంధిత ఉద్యోగిణిని ఫోన్‌లో వివరణ కోరగా, తాను డీటీ ఆదేశాల మేరకే పని చేస్తున్నట్లు తెలిపారు.
అయితే కొందరిపై మాత్రమే దాడులు చేసి, ఇంకొందరిపై మౌనం పాటించడం ఎందుకని ప్రశ్నించగా సమాధానం శూన్యంగా మిగిలింది.
ఈ అంశంపై సివిల్ సప్లై డీటీని కూడా వివరణ కోరగా, మూడు మండలాల్లో ఆమె పని చేయవచ్చని తెలిపారు. కొన్ని కేసుల విషయమై ప్రశ్నించగా, పాత బస్టాండ్ సమీపంలోని పిండిమిల్లుకు సంబంధించి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మిగతా ఆరోపణలపై వివరణ కోరగా, అవి తమ దృష్టికి రాలేదని, ఎవరు పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నా వారిపై చర్యలు తీసుకుంటామని, ఈ విషయంలో ప్రత్యేక దృష్టి సారిస్తామని డీటీ స్పష్టం చేశారు.
అయితే డీటీపై కూడా పెద్ద ఎత్తున ఆరోపణలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలో డీలర్ల నుంచి నెలకు రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. డీటీ చెప్పారంటూ ఎచ్చెర్లలో పనిచేస్తున్న ఆర్ఐ శ్రీకాకుళంలో పని చేయడం ఎలా అన్నది పూర్తిస్థాయిలో తెలియాల్సి ఉంది. ఉన్నతాధికారులు డిప్యూటేషన్ గానీ, అధికారిక నియామకం గానీ ఇవ్వకపోయినా జిల్లా కేంద్రంలో సివిల్ సప్లై విభాగానికి పని చేయవచ్చన్న మౌఖిక ఆదేశాలేమైనా ఉన్నాయా అన్నది కూడా స్పష్టతకు రావాల్సి ఉంది.

మరింత సమాచారంతో మళ్లీ కలుద్దాం...


## భారత నౌకాదళం గ్లోబల్ స్థాయిలో ఎదుగుతోంది

కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు






## ఆక్స్‌ఫర్డ్, ఎల్ఎస్ఈల్లో శ్రీకాకుళం యువకుడికి చోటు



- ప్రపంచ స్థాయి వర్సిటీల నుంచి అరుదైన ఆహ్వానం..
- 'అభి చంద్ర కార్తీక్' అరుదైన ఘనత

2లో

## కిరాక్ ఆర్పి వాఖ్యలు
## సమాజానికే సిగ్గుచేటు



నవతరం-శ్రీకాకుళం

రాజకీయ అనుభవం ఉన్న బొత్స.సత్యనారాయణపై జబర్దస్త్ నటుడు కిరాక్ ఆర్పి చేసిన వ్యాఖ్యలు సరికాదని, ఆయన వాఖ్యలు సమాజానికే సిగ్గుచేటని, తూర్పు కాపు సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండల గణేష్ అన్నారు. స్థానిక ఇందిరానగర్ లోని తూర్పుకాపు సంక్షేమ సంఘం భవనంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఇతర సభ్యుల బృందంతో కలసి మాట్లాడుతూ బొత్స సత్యనారాయణపై చేసిన బాడీ షేమింగ్, అవమానకర,

-మిగతా 2లో

## పేదలకు మెరుగైన వైద్యం అందాలంటే కూటమితోనే సాధ్యం

- మంత్రి అచ్చెన్నాయుడు కృషికి నిదర్శనమే ఆయుష్ ఆసుపత్రి
- రాష్ట్రానికి గరిష్ట నిధులు రాబట్టడంలో కీలకపాత్ర
- పేద ప్రజల కోసమే నిరంతర కృషి
- టెక్కలి ని అభివృద్ధి చేయడమే ఆయన లక్ష్యం
- ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన కోటబొమ్మాళి ఏఎంసి డైరెక్టర్ జర్జాన రాంజీ

నవతరం -టెక్కలి



టెక్కలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకుని నిరంతరం అభివృద్ధికే ప్రాధాన్యత ఇస్తూ అడుగులు వేస్తున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కు బిజెపి మండల అధ్యక్షులు మరియు కోటబొమ్మాళి ఏఎంసి డైరెక్టర్ జర్జాన రాంజీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యం అందాలంటే కూటమి తోనే సాధ్యమవుతుందని అన్నారు. అందుకు అనుక్షణం అడుగులు వేస్తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నిరంతర కృషికి ఫలితమే ఈ 50 పడకల ఆయుష్ ఆసుపత్రి అని కొనియాడారు. అప్పట్లో పాత ఆస్పత్రి తీసుకువచ్చింది, నేడు కొత్త ఆసుపత్రికి తీసుకువచ్చింది మరియు మరల ఈ ఆయుష్ ఆసుపత్రి తీసుకువచ్చింది

-మిగతా 2లో

ఎడిటోరియల్

# కోడ్‌లపై తిరుగుబాటు..!

మన పత్రికలు కొన్ని సంఘటనలను నిర్లక్ష్యం చేసి నిశ్శబ్దంతో చంపే ప్రయత్నం చేస్తాయి. కుదరకపోతే బోలెడంత పబ్లిసిటీతో చంపుతాయి. రెండూ మన జ్ఞానాన్ని కంట్రోల్ చేసే ప్రయత్నాలే!" కారంచేడు ఘటనపై రాసిన వ్యాసంలో అంటాడు సివి సుబ్బారావు. మొన్నటి అఖిల భారత సమ్మె వార్తలకూ అదే గతిపట్టించాయి మన పత్రికలు. దాన్లో తెలుగు పత్రికల జ్ఞాన శూన్యతకు అగ్రతాంబూలం ఇవ్వాల్సిందే. వామపక్ష పార్టీలు, వారి ఆలోచనా ధోరణిగల పత్రికలే మినహాయింపు. ఇక బూర్జువా పార్టీలు ఈ కోడ్‌లపై పల్లెత్తు మాట అన్న స్థితిలేదు. ఫిబ్రవరి 12వ తేదీన జరిగిన బ్రహ్మాండమైన కార్మికుల ర్యాలీని అడ్రస్ చేస్తూ పీసీసీ అధ్యక్షులవారు తమ ఏఐసీసీ ఈ సమ్మెకు మద్దతు తెలిపిందని చెప్పగానే కార్మికులు రానున్న బడ్జెట్ సమావేశాల్లో 'ఆ కోడ్‌లు మన రాష్ట్రంలో అమలు చేయం' అని తీర్మానించమని ఒత్తిడి చేశారు. పాముచావకుండా, కర్ర విరగకుండా ఆయన చెప్పిన మాటలు కార్మికులు గమనించారు. ఇటీవల చెన్నైలో కార్ల్‌మార్క్స్ విగ్రహం ఆవిష్కరించిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి (ఈ సందర్భంగా ఆయన పేరు రాయడం ఇబ్బందే మరి!) తాను అభివృద్ధిగాముక ఆలోచనలకు వారసుడినని చెప్పుకున్నారు. కోడ్‌ల గురించి పల్లెత్తుమాట అనలేదు. శామ్‌సంగ్ కార్మికులనడిగితే తెలిసేది. రసాయన శాస్త్ర పరిభాషలో ఎవరు ఏవైపునున్నారో తెలిపే 'లిట్మస్' పరీక్ష ఇదే! "మేల్కొనుము! లేదా శాశ్వతంగా పడే ఉండు!" అంటాడు జాన్ మిల్టన్ (ప్యారడైజ్‌లాస్ట్‌లో). శాశ్వతంగా పడుండటానికి కార్మికులేమైనా తలలూపే గంగిరెద్దులా?! తొక్కినచోటే తొక్కుకుంటూ గుండ్రంగా తిరిగే గానుగెద్దులా?! కాదుగాక కాదు. జల్లికట్టులో ఎగిరెగిరి దూకే పోట్లగిత్తలు వీరు. అందుకే మోడీ సర్కార్ సార్వత్రిక సమ్మెని విఫలం చేయడానికి మిగిలిన మూడింటికంటే 'దండోపాయాన్నే' నమ్ముకుంది.

లేబర్‌కోడ్స్ అవే! ఒక యూనియన్ సమ్మె నోటీసిచ్చిన తర్వాత విద్యుత్‌రంగంలో సమ్మెలోకి వెళ్లదల్చుకున్న కార్మికులు ఒక్కొక్కరి నుండి రాతపూర్వకంగా వివరణ కోరారు అధికారులు. ఇది కార్మికులను భయపెట్టేందుకే! ఐ.ఆర్.కోడ్ అమల్లోకి రాకముందే ఈ పరిస్థితి ఉంటే ఏప్రిల్ ఒకటి తర్వాత కార్మికుల స్థితి ఏమిటి? "దండం దశ గుణం భవేత్!" (దుడ్డుకర్రతో బాదితే పదిరకాల దుర్గుణాలు పోతాయని నానుడి) సర్వీసు బ్రేక్ వస్తుందని, ఇంక్రిమెంట్లు (క్యుమిలేటివ్) శాశ్వతంగా పోతాయని దానివల్ల ఇన్ని లక్షల రూపాయలు నష్టమొస్తుందని ప్రచారంలో పెట్టారు. బెదర గొట్టడంలో ఇదొక పద్ధతి. ప్రభుత్వరంగాన్ని మోడీ ప్రభుత్వం ఊడ్చేస్తున్నా 'మచ్చిక'చేసుకున్న కొన్ని కార్మిక సంఘాలు తమ పరిశ్రమకూ, తద్వారా తమ జీతాలకు, జీవితాలకు ఏ ప్రమాదమూ లేదన్నట్టు, రాదన్నట్టు ప్రవర్తించాయి.

అదీ అఖిల భారత స్థాయిలో తమ అధినాయకుడు గంభీరోపన్యాసం చేసినా ప్రశాంతంగా ఉండటం మోడీ సర్కార్‌కు ఆనందదాయకమైన విషయం. వారి రాజకీయ పార్టీలేసిన పగ్గాలు కొన్ని సంఘాలకుంటే, దశాబ్దాల తరబడి యజమానుల బూట్లు నాకడానికి అలవాటుపడ్డ శరీరాలు మరికొన్ని! ఇవన్నీ గాక లేదా వీరందరూగాక, దేశంలో "అతిపెద్ద" కార్మిక సంఘంగా చెప్పుకుంటున్న ఆరెస్సెస్ వారి కార్మిక విభాగం, కనీసం తమ సిద్ధాంతాన్ని కార్మికుల్లో ప్రచారం చేసి ఒప్పించి, మెప్పించుకునే ధైర్యం లేకనో, సమయం చాలకనో అనేక పారిశ్రామిక వాడల్లో ఫిబ్రవరి పదిన కరపత్రం పంచింది. పన్నెండు సమ్మెలో లేని డిమాండ్లు ఉన్నట్టు ఊహించుకున్న వారి కరపత్రం చూస్తే దేంతో నవ్వాలో తెలీక కార్మికులు సతమతమవుతున్నారు. పెట్టుబడి సేవకే అంకితమైన బీఎంఎస్ పాచి వాదనలను మొన్న పదో తేదీనే 'నవతెలంగాణ' ఎండగట్టింది. గతంలో కనీసం దేశవ్యాపిత సమ్మె ముగిసిన మర్నాడు ఫిక్కీనో, అసోచామ్ వారో ఆర్థిక వ్యవస్థకు ఇంతనష్టం, అంతనష్టం అనే వార్తలైనా మీడియాకు చెప్పేవారు. ప్రారంభంలో చెప్పినట్లు ఇది అప్రకటిత సెన్సార్‌షిప్‌లో భాగమేనేమో, ప్రకటనలే లేవు. 'ఏఐ'కి కూడా అందనంత గుప్తంగా, గుంభనంగా ఉంది సర్కార్ ధోరణి. ఎస్‌కెఎం పిలుపుపై రైతాంగం, విబిజి రామ్‌జికి వ్యతిరేకంగా వ్యవసాయ కూలీలు పెద్దసంఖ్యలో గ్రామీణబంద్‌లో పాల్గొన్నారు. ఈ సమ్మె సందర్భంగా కార్మిక సంఘాలు ఆలోచించు కోవాల్సినవీ, ఆత్మవిమర్శ చేసుకోవల్సినవీ ఉన్నాయి. ఆయా సంఘాలు తమ కార్యకర్తలను కోడ్‌లపై ఏ మాత్రం ఎడ్యుకేట్ చేశాయి? 'చేశామను'కునే సంఘం కార్యకర్తలు, కమిటీలు ఏ కోడ్‌లు కార్మికులకు ఏ మాత్రం, ఏ విధంగా దెబ్బతీస్తాయనే విషయం వివరించారా? సంఘటిత, అసంఘటిత రంగాలకు ఏకమూలికా ప్రయోగం చేశారా? అనే అంశం నాయకత్వ కమిటీలు పరిశీలించుకోవాలి. చావో, రేవో తేల్చుకోవాల్సిన పోరాటంలో ఉన్నామనే విషయం కార్మికులకు ఏ మాత్రం అర్థమైంది? లేబర్ కోడ్స్ తటస్తమైనవి కావు. యాజమాన్యాల కోసమే ఇవి. మనుస్మృతి అంటేనే అసమానత. నిచ్చెనమెట్లు. అణిచివేత. ప్రతిఘటన లేకుండా లేబర్‌కోడ్స్‌ను ఆమోదించడమంటే తరతరాలుగా ఉన్న కుల, వర్గ బంధనాలను ఆమోదించడం. ఈ విషయంలో కార్మిక జన బాహుళ్యాన్ని చైతన్య పరచడమనేది కార్మిక నాయకుల బాధ్యత. ఏమైనా మొన్నటి సమ్మెలో ఎన్నో ఒత్తిడులు, బెదిరింపులకు తట్టుకొని పాల్గొన్న 30 కోట్ల మంది కార్మికులకు జేజేలు.

## భారత నౌకాదళం గ్లోబల్ స్థాయిలో ఎదుగుతోంది

**నవతరం -విశాఖపట్నం**

విశాఖపట్నంలో జరిగిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ 2026లో భారత రాష్ట్రపతి మరియు సాయుధ దళాల సర్వసైన్యాధిపతి ద్రౌపది ముర్ముతో కలసి పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నానని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు.
ఈ కార్యక్రమంలో INS సుమేధా నౌకపై ప్రయాణిస్తూ రాష్ట్రపతితో పాటుగా గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , నౌకాదళ అధిపతి అడ్మిరల్ దినేష్ కె త్రిపాఠిలతో కలసి భారత నౌకాదళం మరియు మిత్ర దేశాల నౌకాదళాలకు చెందిన 72 ఆధునిక యుద్ధ నౌకలు, సబ్‌మరైన్లను సమీక్షించారు. యునైటెడ్ త్రూ ఆడియన్స్ అనే థీమ్‌తో జరిగిన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ 2026 భారత్ సముద్ర శక్తి పెరుగుదలను, ప్రపంచ దేశాలతో బలపడుతున్న భాగస్వామ్యాలను ప్రతిబింబించింది. ఈ సందర్భంగా స్వదేశీ విమాన వాహక నౌక INS విక్రాంత్ పాల్గొనడం గర్వకారణమని అన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో కీలక పాత్ర పోషించిన ఈ నౌక రక్షణ రంగంలో ఆత్మనిర్భర్ భారత్‌కు ప్రతీకగా నిలిచిందనీ అన్నారు. అంతర్జాతీయ నావికాదళాల భాగస్వామ్యం ఇండో-పసిఫిక్ అంతటా సముద్ర భద్రత, సహకారం పట్ల సమిష్టి సంకల్పాన్ని తాజా కార్యక్రమం ప్రదర్శించిందనీ రామ్మోహన్ నాయుడు అన్నారు. భారత నౌకాదళం గ్లోబల్ స్థాయిలో ఎదుగుతొందని.. అందుకు తాజా కార్యక్రమం నిదర్శనంగా నిలుస్తోందని అన్నారు.

## రుణం చెల్లించి.. ఆదర్శంగా నిలిచి!



**నవతరం -శ్రీకాకుళం**

జిల్లా షెడ్యూల్డు కులముల సేవా సహకార సంస్థ (ఎస్సీ కార్పొరేషన్) ద్వారా రుణం పొందిన లబ్ధిదారుడు పెరుమల రామారావు సకాలంలో బకాయిలు చెల్లించి ఇతర రుణగ్రహీతలకు ఆదర్శంగా నిలిచారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఎన్ఎస్ఎఫ్‌డీసీ పథకం కింద కిరాణా షాపు యూనిట్ కోసం ఆయన రూ.లక్ష రుణాన్ని పొందారు. ప్రభుత్వం ప్రకటించిన వడ్డీ మాఫీ పథకాన్ని పురస్కరించుకుని, బుధవారం తన వద్ద ఉన్న మిగిలిన అసలు మొత్తాన్ని రికవరీ ఆఫీసర్, సహాయ కార్యనిర్వహణాధికారిణి ఆర్.సుధారాణికి పూర్తిస్థాయిలో చెల్లించారు.
ఈ సందర్భంగా లబ్ధిదారుడు రామారావును జిల్లా ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు వినాయకం ఘనంగా సత్కరించారు. నిజాయితీగా రుణాన్ని తిరిగి చెల్లించిన ఆయన చొరవను అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలోని మిగిలిన లబ్ధిదారులందరూ ప్రభుత్వం జారీ చేసిన వడ్డీ మాఫీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సకాలంలో బకాయిలు చెల్లించి పథకం విజయవంతానికి సహకరించాలని ఈడీ ఈ సందర్భంగా కోరారు.

## ఆక్స్‌ఫర్డ్, ఎల్ఎస్ఈల్లో శ్రీకాకుళం యువకుడికి చోటు

**నవతరం -శ్రీకాకుళం**

జిల్లా యువత మేధస్సు ప్రపంచ స్థాయిలో మరోసారి మెరిసింది.
ప్రతిష్ఠాత్మకమైన ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంతో పాటు లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో ఒకేసారి ప్రవేశం సాధించి, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త (డిసిహెచ్ఎస్) నూర్తి కళ్యాణ్ బాబు కుమారుడు అభి చంద్ర కార్తీక్ నూర్తి చరిత్ర సృష్టించారు. ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలో 'ఎంఫిల్ డెవలప్‌మెంట్ స్టడీస్ (ఎకనామిక్స్)' చదివేందుకు ఆయనకు అవకాశం లభించింది. మన జిల్లా నుంచి కింగ్స్ కాలేజ్ లండన్, ఎల్ఎస్ఈ, ఆక్స్‌ఫర్డ్ వంటి మూడు అత్యున్నత విశ్వవిద్యాలయాలకు ఎంపికైన తొలి వ్యక్తిగా ఆయన రికార్డు నెలకొల్పారు.

### ప్రతిభకు నిలువుటద్దం..

స్థానిక సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేసిన అభి, చిన్నప్పటి నుంచే చదువులో చురుగ్గా ఉండేవారు. నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ స్కాలర్‌గా తన మేధస్సును నిరూపించుకున్నారు. లండన్‌లోని కింగ్స్ కాలేజీలో ఫిలాసఫీ, పొలిటిక్స్ అండ్ ఎకనామిక్స్ విభాగంలో ఫస్ట్ క్లాస్‌లో పట్టా పొందారు.
అనంతర కాలంలో కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం, కింగ్స్ కాలేజ్ లండన్ సంయుక్తంగా నిర్వహించిన 'ఎంగెల్స్‌బర్గ్ అప్లైడ్ హిస్టరీ ఫెలోషిప్' కు కూడా ఆయన ఎంపికయ్యారు.

### రాజకీయ విశ్లేషణలోనూ అనుభవం..

విద్యతో పాటు సామాజిక అంశాల్లో తనదైన ముద్ర వేసిన అభి చంద్ర కార్తీక్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్ మోహన్ నాయుడు వద్ద 'పొలిటిక్స్ ఫర్ ఇంపాక్ట్' ఇంటర్న్‌గా కూడా పనిచేశారు.
జిల్లాకు చెందిన యువకుడు సాధించిన ఈ అంతర్జాతీయ విజయంపై జిల్లావ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

## అసభ్య ప్రవర్తనను గట్టిగా ఎదిరించాలి



**నవతరం -శ్రీకాకుళం**

బాలల భద్రత కోసం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న స్నేహపూర్వక న్యాయ సేవలను విద్యార్థులు వినియోగించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. హరిబాబు సూచించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ రోడ్డులోని సన్‌షైన్ స్కూల్‌లో 8, 9 తరగతుల విద్యార్థులకు 'గుడ్ టచ్ - బ్యాడ్ టచ్'పై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంధువులు, స్నేహితులు లేదా ప్రయాణాల్లో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, శరీర భాగాలపై అనుచితంగా చేతులు వేసినా భయపడకుండా వెంటనే 'వద్దు' అని గట్టిగా చెప్పాలని హితవు పలికారు.
ఇటువంటి చర్యలు చట్టరీత్యా నేరమని, వీటికి కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఆపదలో ఉన్నప్పుడు లేదా ఎవరైనా వేధింపులకు గురిచేసినప్పుడు విద్యార్థులు వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098, పోలీసు 112 లేదా ఉచిత న్యాయ సేవల నంబర్ 15100కు సమాచారం అందించాలని హరిబాబు సూచించారు. పిల్లలు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది జి. ఇందిరా ప్రసాద్, పాఠశాల ప్రిన్సిపల్ కె. ప్రదీప్, కో-ఆర్డినేటర్ కె. నీరజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పేదలకు మెరుగైన వైద్యం అందాలంటే కూటమితోనే సాధ్యం

మొదటిపేజీ తరువాయి

కూడా కింజరాపు అచ్చెన్నాయుడు నేనని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలని,ప్రజారోగ్యానికి కూటమి ప్రభుత్వ పెద్దపేట వేస్తుందని గుర్తు చేశారు. టెక్కలిలో 15 కోట్ల వ్యయంతో ఈ కీలక ప్రాజెక్ట్ ను నిర్మించేందుకు ఆయుష్ డిపార్ట్మెంట్ డైరెక్టర్ కే దినేష్ కుమార్ ఐఏఎస్ ఉత్తరవులు జారీ చేసిన విషయం అందరికీ తెలిసినదే. అయితే ఈ ఆస్పత్రి కార్యరూపం దాల్చడం కోసం మంత్రి చేసిన కృషి ఎవ్వరూ ఎన్నటికీ వెలకట్టలేనిదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో జాతీయ ఆయుష్ మిషన్ ద్వారా రాష్ట్రానికి గరిష్ట నిధులు రాబట్టడంలో మంత్రి కీలక పాత్ర పోషించారని చెప్పుకొచ్చారు. మండల కేంద్రంలో దూర ప్రాంతాలలో ఉన్న పేద ప్రజలకు ఆయుష్ వైద్య సేవలు మరింత చొరవగా కావాలనే సంకల్పంతో వైద్య కేంద్రంగా టెక్కలిని అభివృద్ధి చేయడమే ఆయన లక్ష్యంగా ఈ ఆస్పత్రి ప్రతిపాదనను ముందుకు తీసుకువచ్చారని తెలిపారు. ఈ ఆస్పత్రి ప్రారంభమైతే జిల్లాలో ఉన్న ప్రజలకు ఆయుర్వేదం, యోగ, హోమియోపతి మరియు ప్రకృతి వైద్య సేవలు ఒకే వేదికపై అందుబాటులోకి రానున్నాయన్నారు. ప్రజారోగ్యానికి ప్రార్ధన్యం ఇస్తూ, ఆరోగ్యకరమైన సామాజ నిర్మాణం దిశగా టెక్కలి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కి ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు జర్జాన రాంజీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నారు.

## కిరాక్ ఆర్పి వాఖ్యలు సమాజానికే సిగ్గుచేటు

మొదటిపేజీ తరువాయి

వ్యక్తిగత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, రాజకీయాలలో విమర్శలు సహజమని, అవి వ్యక్తుల రూపురేఖలపై లేదా వ్యక్తిత్వంపై దాడుల రూపంలో ఉండకూడదన్నారు.
బొత్సపై మాట్లాడే అర్హత కిరాక్ ఆర్పికి లేదని, ప్రస్తుతం రాష్ట్రంలో రాజకీయాల స్థాయి ఈ విధంగా దిగజారడం ఆందోళనకరంగా ఉందన్నారు. తక్షణమే కిరాక్ ఆర్పిని సమాజ బహిష్కరణ చేయాలని, ఆర్పీ లాంటి వ్యక్తుల వల్ల సమాజానికి మేలు కంటే, కీడే అధికంగా జరుగుతోందని ఆరోపించారు.
ఏ అర్హతతో బొత్సను ఆర్పీ విమర్శిస్తున్నాడో అర్థం కావడంలేదని, సోషల్ మీడియా వేదికగా ఆయన చేసిన వాఖ్యలు సరికాదన్నారు.
ఈ సమావేశంలో సంఘ గౌరవాధ్యక్షుడు ఇజ్జాడ.శివన్నారాయణ, కరణం శ్రీనివాసరావు, యువజన కార్యదర్శి జొన్న రాజు, టౌన్ కార్యదర్శి డోల.నాగరాజు, నగర అధ్యక్షుడు హారిక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఊరి బడికి ఊపిరి పోయడం ఎలా?

బ్రిటిష్ వారి పాలన కంటే ముందే మన దేశంలో వీధి బడులు ఉన్నాయి. వీటిల్లో అందరూ చదువు కునేవారు. కొన్ని ప్రాంతాల్లో మాత్రం అంటరానితనం వంటి సాంఘిక దురాచారాల వల్ల అణగారిన వర్గాల వారు చదువుకు దూరం అయ్యారు.అందువల్లే పూలే దంపతులు,అంబేద్కర్ వంటి మహనీయులు అణగారిన వారి హక్కుల కోసం తీవ్రంగా పోరాడ వలసి వచ్చింది.
ఇందుకు అనుగుణంగా భారత రాజ్యాంగంలో వారికి కొన్ని సదుపాయాలు కల్పించారు. వీటి ఫలితంగా వారి జీవితాల్లో కొంత మార్పు వచ్చింది. ఇందులో ఊరి బడి కీలక పాత్ర పోషించింది. ప్రభుత్వ బడుల్లో చదువుకున్న ఎందరో ఉన్నత స్థాయికి ఎదిగారు. ఆనాటి ఉపాధ్యాయ సిబ్బంది గ్రామ ప్రజలతో మంచి అనుబంధం కలిగి ఉండేవారు. అప్పట్లో బడుల్లో పెద్దగా సదుపాయాలు కూడా ఉండేవి కావు.ఉన్న సదుపాయాలతోనే సర్దుకుపోయారు.
ప్రస్తుతం ఎక్కడ చూసినా ప్రయివేట్ పాఠశాలలు పెరుగుతున్నాయి. ఇంగ్లీష్ మీడియం, ఐ ఐ టీ కోర్సులకు గట్టిగా సిద్ధం చేస్తామని చెప్పి జనవరి నుంచే ప్రయివేట్ పాఠశాలల వారు ఇంటింటికి తిరుగుతున్నారు.మరో వైపు విద్యా హక్కు చట్టం ప్రకారం ఒకటవ తరగతి విద్యార్థులకు 25శాతం సీట్లను ప్రయివేట్ పాఠశాలల్లో కేటాయిస్తామంటూ ప్రభుత్వం ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇంకో వైపు గురుకుల, నవోదయ, ఏకలవ్య, ఆశ్రమ, కె. జి. బి. వి, మోడల్ స్కూళ్లు తమ పాఠశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్స్ ఇచ్చాయి. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య తగ్గింది.
వివిధ పాఠశాలల్లోకి చేరే పిల్లలు పోనూ, మిగిలిన కొద్ది మంది పిల్లలు ఊరి బడిలో చేరడానికి మిగిలి ఉంటారు. ఇలా చేరిన వారిలో కొందరుఉపాధి కోసం వలస పోతారు. ఇటువంటి పరిస్థితిలో ఊరి బడికి ఎలా ఊపిరి పోయాలి.


యం.రాం ప్రదీప్

ఇప్పటికీ చాలా మంది ఉపాధ్యాయులు పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నారు. గ్రామ పెద్దలను కలుస్తున్నారు.పూర్వ విద్యార్థులు కూడా పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తూనే ఉన్నారు. అయితే ఇలా కష్టపడే సిబ్బందికి అధికారుల నుంచి నైతిక మద్దతు అవసరం. ఇప్పటికే చాలా మంది ప్రభుత్వ ఉపాధ్యాయ సిబ్బంది ఎన్రోల్మెంట్ డ్రైవ్ చేపట్టారు. కానీ గ్రామాల్లో నెలకున్న వివిధ పరిస్థితుల వల్ల ఇటువంటి కార్యక్రమాలకు అనుకున్న మద్దతు రావడం లేదు.
ప్రస్తుత పరిస్థితులలో ఉపాధ్యాయ సిబ్బంది మధ్య ఐక్యత చాలా అవసరం. పాఠశాల అభివృద్ధి విషయంలో ఏకభిప్రాయానికి రావాలి. ఏవైనా సమస్యలు ఉంటే వాటిని చర్చల ద్వారానే పరిష్కారం చేసుకోవాలి.
కులం, మతం వంటి అంశాలను వ్యక్తిగత అంశాలుగానే భావించాలి. కేవలం మన హక్కుల కోసమే కాకుండా, పిల్లల హక్కుల కోసం కూడా మనం కృషి చేయాలి.
పాఠశాలల్లో కూడా ఒక నిర్దిష్టమైన సిలబస్ ఉండాలి. పాఠ్య పుస్తకాలకు, పరీక్షలకు దగ్గర సంబంధం ఉండాలి. శిక్షణ తరగతులు వేసవిలో ఉండాలి. ఎన్ని పేర్లు మారినా, చివరికి పిల్లలకు ఎక్కాలు, గుణింతాలు, వారి వయసుకు తగ్గట్టు కాస్తో కూస్తో చదవడం, రాయడం వంటివి రావాలి. చూచిరాత బుక్స్ పెట్టాలి. వేసవిలో ఓ వారం, పదిరోజులు ప్రభుత్వం చెప్పినా, చెప్పక పోయినా స్వచ్ఛంద బడిబాట నిర్వహించాలి. వీలుంటే అన్ని పాఠశాలల్లో కనీసం నవంబర్ నుంచి అయినా ఓ అర్ధ గంట అదనపు సమయం పిల్లలకు కేటాయించాలి(హై స్కూల్స్ లో ఎలాగూ జరుగు తున్నాయి). ఇలా చేస్తే ఊరి బడికి కొంత ఊపిరి పోయవచ్చు.


# కర్ణాటక రాష్ట్రం ఉడిపి జిల్లాలో శ్రీ బ్రహ్మీ దుర్గా పరమేశ్వరి దేవాలయం





కర్ణాటకలోని ఉడిపి జిల్లాలో ఉన్న శ్రీ బ్రాహ్మి దుర్గా పరమేశ్వరి దేవాలయం (కమలాశిలె) యొక్క చరిత్ర పురాణాలు మరియు స్థానిక ఇతిహాసాలతో ముడిపడి ఉంది. ఈ ఆలయం కమలాశిలై అనే ప్రశాంతమైన గ్రామంలో, పశ్చిమ కనుమల పచ్చని అడవులు మరియు కుబ్జా నది ఒడ్డున ఉంది.
ఈ ప్రదేశానికి 'కమలాశిలె' అనే పేరు 'కమల' (తామర పువ్వు), 'శిలె' (రాయి) అనే సంస్కృత పదాల నుండి వచ్చింది, ఇక్కడ దేవత తామరపువ్వు ఆకారంలో ఉన్న ఒక శిల (లింగం) రూపంలో పూజించబడుతుంది.ఇక్కడి ప్రధాన దేవత బ్రాహ్మీ దుర్గా పరమేశ్వరి, ఈమె మహాకాళి, మహాలక్ష్మి మరియు మహా సరస్వతి అనే త్రిశక్తుల సమ్మేళన రూపంగా భావించబడుతుంది. ఈమెను లింగ రూపంలో ఆరాధించడం ఈ ఆలయం యొక్క ఒక ప్రత్యేకత.
కమలశిలలో బ్రహ్మీ దుర్గా పరమేశ్వరి అమ్మవారు లింగ రూపంలో వెలిశారు. దీని వెనుక ఒక పౌరాణిక కథ ఉంది. పూర్వం, రైక్వ మునితో సహా అనేకమంది రుషులు కుబ్జ నది ఒడ్డున తపస్సు చేసేవారు. కరాసుర, రక్తసుర అనే రాక్షసులు వారి తపస్సుకు ఆటంకాలు కలిగించేవారు. రాక్షసుల బాధలు భరించలేక, రుషులు ఆదిపరాశక్తిని ప్రార్థించారు. వారి ప్రార్థనలు విన్న అమ్మవారు ఆ రాక్షసులను సంహరించారు. రుషుల కోరిక మేరకు, అమ్మవారు అదే నది ఒడ్డున లింగ రూపంలో వెలిశారని చెబుతారు. అప్పటినుండి ఇక్కడ దుర్గా పరమేశ్వరిని లింగ రూపంలో పూజిస్తున్నారు. ఒక బ్రాహ్మణుడికి కలలో అమ్మవారు కనిపించి, తాను బ్రహ్మీ దుర్గా పరమేశ్వరి అని చెప్పడంతో, గ్రామస్తులు అమ్మవారి విగ్రహంతో పాటు లింగాన్ని కూడా ప్రతిష్ఠించి పూజిస్తున్నారు.
ఈ ఆలయం పవిత్ర స్థలం భక్తికి నిజమైన నిదర్శనం లింగరూపంలో శక్తివంతమైన దుర్గా పరమేశ్వరి దేవతను ఆరాధించడానికి అంకితం చేయబడింది ఈ ఆలయం అందంగా సంప్రదాయాన్ని సూచిస్తుంది.
త్రేతా యుగంలో, ఖరరాక్షసుడు అనే రాక్షసుడిని సంహరించడానికి పార్వతీ దేవి దుర్గా దేవి రూపంలో ఇక్కడ లింగంగా అవతరించింది అని పురాణాలు చెబుతున్నాయి.బ్రహ్మప్రపంచాన్ని సృష్టించినప్పుడు దేవత కమలాశిలె లింగంగా కనిపించిందని, మొదట బ్రహ్మ లింగేశ్వరుడిగా పూజించబడిందని మరో కథనం ఉంది.భార్గవ మహర్షి ఇక్కడ దుర్గా పరమేశ్వరి దేవి విగ్రహాన్ని పశ్చిమ ముఖంగా ప్రతిష్ఠించాడని కూడా చెబుతారు.
కుబ్జా నది పురాణం: కుబ్జా నది ఒకప్పుడు పింగళ అనే అప్సరస అని, శివపార్వతుల శాపం కారణంగా వంకరగా, వికారంగా భూమిపై నది రూపంలో జన్మించిందని నమ్ముతారు. ఆమె ఇక్కడ తపస్సు చేసి, కృష్ణుడి స్పర్శతో శాపవిమోచనం పొందింది. ఈ నది ప్రతి సంవత్సరం ఒకసారి పొంగి ఆలయ గర్భగుడిలోకి ప్రవేశించి దేవతకు పూజ చేస్తుందని ప్రతీతి. ఈ ఆలయం యొక్క ప్రాచీన చరిత్ర మరియు ప్రశాంతమైన వాతావరణం భక్తులను ఆకర్షిస్తాయి. మైసూర్ పాలకులైన హైదర్ అలీ మరియు అతని కుమారుడు టిప్పు సుల్తాన్ ఆలయ నిర్వహణకు పోషకులుగా వ్యవహరించారు వారికి నివాళిగా ఈనాటికీ ప్రతి సాయంత్రం ఆలయంలో "సలాం పూజ" లేదా " సలాం మంగళహారతి" అనే ప్రత్యేక పూజ నిర్వహిస్తారు.
ఈ దేవాలయం కేవలం ఆధ్యాత్మిక కేంద్రమే కాదు హిందూ ముస్లిం మతసామరస్యానికి నిలువుటద్దం గా నిలుస్తుంది.
ఈ దేవాలయాన్ని బాప్పా అనే ముస్లిం శిల్పి నిర్మించాడని చెబుతారు అందుకే ఈ ప్రాంతానికి బాప్పానాడు అనే పేరు కూడా వచ్చింది అని తెలుస్తోంది హిందువులతో పాటు ఈ ఆలయంలో ముస్లింలు కూడా దేవాలయ పండుగలలో ఉత్సాహంగా పాల్గొంటారు.

వ్యాసకర్త
ఆధ్యాత్మిక సాహిత్య వ్యాసభూషణ్, ఆధ్యాత్మక సాహిత్య సామ్రాట్ కావ్యసుధ,
హైదరాబాద్,
సెల్ 92473 13488



# పెళ్లి కోసమే సినిమా ఆఫర్ వదులుకుందా?

తెలుగు, హిందీ భాషల్లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తోంది రష్మిక. ఒక తెలుగు సినిమా చేస్తే, మరో హిందీ సినిమాకు కాల్షీట్లు ఇస్తోంది. ఇలా రెండు భాషల్ని బ్యాలెన్స్ చేస్తూ కెరీర్ ను మలుచుకుంటున్న ఈ ముద్దుగుమ్మ, తాజాగా ఓ హిందీ సినిమా ఆఫర్ ను రిజెక్ట్ చేసింది.
షాహిద్ కపూర్, రష్మికను హీరోహీరోయిన్లుగా పెట్టి ఓ రొమాంటిక్ ఎంటర్ టైనర్ ప్లాన్ చేశాడు దర్శకుడు అమిత్ శర్మ. ఇందులో నటించేందుకు షాహిద్ దాదాపు ఓకే చెప్పాడు. రష్మిక మాత్రం సున్నితంగా ఈ ఆఫర్ ను తిరస్కరించిందట. దీనికి కారణం ఆమె పెళ్లి అని తెలుస్తోంది. మరికొన్ని రోజుల్లో హీరో విజయ్ దేవరకొండను పెళ్లాడనుంది రష్మిక. ఇప్పటికే ఇద్దరికీ నిశ్చితార్థం పూర్తయిన సంగతి తెలిసిందే. పెళ్లి తర్వాత హైదరాబాద్ లో గ్రాండ్ రిసెప్షన్ కూడా అనుకుంటున్నారు. అలా పెళ్లి, రిసెప్షన్ తర్వాత కొన్నాళ్ల పాటు కెరీర్ లో గ్యాప్ తీసుకోవాలని రష్మిక భావిస్తోందంట. అందుకే ఆమె అమిత్ శర్మ ప్రాజెక్టును తిరస్కరించిందనే ప్రచారం మొదలైంది బాలీవుడ్ లో. నిజానికి షాహిద్-రష్మిక కలిసి ఓ సినిమా చేస్తున్నారు. దీంతో ఇద్దర్నీ మరో సినిమాకు ఒప్పించడం పెద్ద కష్టం కాదనుకున్నాడు దర్శకుడు. కానీ పెళ్లి కోసం రష్మిక గ్యాప్ తీసుకోవడం వల్ల ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకుందంటూ బాలీవుడ్ మీడియా కథనాలు ప్రసారం చేస్తోంది.
ఈ పుకారుకు ఊతమిస్తూ రష్మిక కూడా సినిమాల జోరు తగ్గించింది. ప్రస్తుతం ఆమె చేతిలో షాహిద్ తో చేస్తున్న కాక్ టైల్-2, తెలుగులో మైసా సినిమాలున్నాయి. వీటిలో కాక్ టైల్-2 దాదాపు పూర్తయింది. మైసా మాత్రమే సెట్స్ పై ఉంది.



# జెన్ నెక్ట్స్ నిర్మాతలు

టాలీవుడ్ లో ఇప్పుడు మోస్ట్ హ్యాపెనింగ్ నిర్మాతలు అంటే నాగవంశీ, స్వప్నదత్, మైత్రీ నవీన్.. రవి, సాహు గారపాటి, సుధాకర్ చెరుకూరి, దిల్ రాజు ఇలా ఆరేడు పేర్లు వినిపిస్తాయి. వీళ్లందరూ వరుసగా భారీ ప్రాజెక్ట్ లు ప్లాన్ చేసుకుంటూ ముందుకు వెళు న్నారు. ఈ పేర్లు అన్నీ ఈ తరం పేర్లే. నిన్నటి తరం పేర్లు ఇప్పుడు పెద్దగా వినిపించడం లేదు.
మరి రేపటి తరం నిర్మాతలు ఎవరు? సెకెండ్ జనరేషన్ మెల్లగా మొదలుకావాలి కదా?
ధీరజ్ మొగిలినేని, రాజేష్ దండా, ఎస్కేఎన్, వంశీ నందిపాటి, బెన్నీ ముప్పనేని, నీహారిక కొణిదెల తరువాత తరం పేర్లు గా వినిపిస్తున్నాయి. ఇక్కడ వీళ్ల పేర్లే ఎందుకు అంటే ప్రతి నెలా వీళ్లలో ఒకరు అయినా ముందుకు వస్తున్నారు ఏదో ఒక సినిమాతో. వీళ్లంతా ఒక్కొక్కరు మూడు నాలుగు ప్రాజెక్ట్ లు ప్లానింగ్ లో వుంచుకున్నారు. అవి వున్నా కూడా కొత్త ప్రాజెక్ట్ ల కోసం వెదుకుతున్నారు. వంశీ నందిపాటి ఒక్కరే కాస్త వేరే రూట్ ఎంచుకున్నారు. సినిమాలు నిర్మించడం కన్నా మార్కెట్ చేయడం అనే దాన్ని ప్రాక్టీస్ చేస్తున్నారు.
నీహారిక కొణిదెల టీవీ షోస్ లోకి కూడా అడుగుపెట్టారు. ఎస్కేఎన్ అటు చిన్న, మీడియం సినిమాలు ఇటు వెబ్ సిరీస్ లు అంటున్నారు. రాజేష్ దండా అల్లరి నరేష్, సంయుక్త మీనన్, అడవిశేష్ ఇలా వరుసగా సినిమాలు ప్లాన్ చేసుకుంటున్నారు.
వీళ్లంతా కూడా ఓటిటి కాంట్రాక్ట్ లను కూడా మెరుగుపరుచుకుంటున్నారు. దాని వల్ల నిర్మాణాలు మరింత సులువు అవుతాయి. సీనియర్ యంగ్ నిర్మాతలు భారీ సినిమాల దిశగా వెళ్తుంటే ఈ యంగ్ జనరేషన్ అంతా చిన్న, మిడ్ రేంజ్ వైపు చూస్తున్నారు. ఇవన్నీ కలిసి 2027 లో సినిమాలు అన్నింటిని పెర్ ఫెక్ట్ గా బ్యాలన్స్ చేసి, ప్రతి నెల విడుదలలు పక్కాగా వుండేలా చూసే అవకాశం కనిపిస్తోంది.



# 2026 డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ



**నవతరం-శ్రీకాకుళం**

కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా ఎస్సీ, ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ (1991) రాష్ట్ర డైరీతో పాటు దళిత హక్కుల పరిరక్షణ సమితి రూపొందించిన "పే బ్యాక్ టు సొసైటీ" క్యాలెండర్లను ఆయన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, దళిత ఉద్యోగుల సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను కేంద్ర మంత్రికి ప్రతినిధులు అందజేశారు. వాటిపై సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే డైరీలోని సమాచారాన్ని పరిశీలించి, సమగ్రంగా ముద్రించినట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో రాష్ట్ర మానవ వనరుల డైరెక్టర్ పీఎంజే బాబు, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ టీచర్స్ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షుడు, ఫౌండర్ పోతల దుర్గారావు, రాష్ట్ర అధ్యక్షుడు ఎండిఎస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అన్ను వెంకట్రావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కొప్పల డేనియల్ పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న ఫ్లీట్ రివ్యూ

**నవతరం- విశాఖపట్నం**




అంతర్జాతీయ నౌకాదళ సమీక్షపై ఆకాశవాణి కేంద్రం ప్రసారం చేసిన ప్రత్యక్ష వ్యాఖ్యానం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. విశాఖపట్నం వేదికగా బంగాళాఖాతంలో భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్మూ త్రివిధ దళాల అధిపతి హోదా లో బుధవారం అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష నిర్వహించారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ కార్యక్రమాన్ని ఆకాశవాణి ప్రత్యక్ష వ్యాఖ్యానం ద్వారా, అలాగే దూరదర్శన్ ప్రత్యక్ష ప్రసారం ద్వారా అందించాయి. ఆకాశవాణి దేశంలోని అన్ని రేడియో కేంద్రాల ద్వారా ఉదయం 9.50నుంచి మధ్యాహ్నం 12.58 నిమిషాల వరకు అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ ప్రత్యక్ష వ్యాఖ్యానాన్ని అందించింది. ఈ వ్యాఖ్యానం శ్రోతలను అలరించింది. ఢిల్లీ, విజయవాడ కేంద్రాల నుంచి వచ్చిన ఆకాశవాణి సిబ్బందికి స్థానిక ఆకాశవాణి కేంద్రం అధికారులు సమన్వయంతో జయప్రదంగా ప్రసారాలను అందించారు. హిందీలో నీలం మల్కానీ, ఆంగ్లంలో కౌశిక్ రాయ్ చక్కటి కంఠ స్వరంతో ఆకాశవాణి శ్రోతలను అలరించింది. ఆకాశవాణి డెప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆర్. హర్షలత, విశాఖపట్నం కేంద్రం కార్యక్రమాల విభాగాధిపతి పి. వి.రామగోపాల్, కార్యనిర్వహణాధికారులు ఎన్.సుధాకర్ రెడ్డి,తేతలి దిలీప్ కుమార్ రెడ్డి సమన్వయంతో కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# బొప్పాయిపురం గ్రామ సచివాలయంలో ప్రత్యేక ఆధార్ డ్రైవ్ క్యాంపెయిన్



**నవతరం టెక్కలి**




నేడు స్థానిక టెక్కలి మండలం బొప్పాయిపురం గ్రామ సచివాలయ కార్యాలయంలో ఈనెల 18 19 తేదీలలో జరుగు చున్న ఆధార్ ప్రత్యేక డ్రైవ్ కాంపైన్ నిర్వహించారు. ఈ క్యాంపెయిన్‌లో అందించే సేవలు ఆధార్‌లో పేరు సవరణ, చిరునామా మార్పు / సవరణ మొబైల్ నంబర్ అప్డేట్ బయోమెట్రిక్ అప్డేట్, మాండేటరీ బయోమెట్రిక్ అప్డేట్ తో సహా ఆధార్‌కు సంబంధించిన అన్ని సాంకేతిక సమస్యల పరిష్కారశీ కొరకు బొప్పాయిపురం, చల్లపేట, విక్రంపురం, అక్కవరం, శ్యామసుందరాపురం, నీలాపురం గ్రామాల ప్రజలు మరియు పిల్లలు ఆధార్ అప్డేట్ కోసం అవసరమైన అన్ని ఒరిజినల్ పత్రాలు తప్పనిసరిగా తీసుకురావలెను. అని వారు తెలియజేశారు. ఈ అవకాశాన్ని వివిధ గ్రామస్తులు హాజరై సద్వినియోగం చేసు కొనగా డిజిట్ డిజిటల్ అసిస్టెంట్ వి వి ఎన్ మూర్తి మరియు కృష్ణ ఇతర సిబ్బంది వారికి సేవలు అందించారు.

# 68 మంది విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ.....

**నవతరం-శ్రీకాకుళం**



జాతీయ అంధత్వ మరియు దృష్టిలోప నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ శ్రీకాకుళం వారి సౌజన్యంతో వైద్యాధికారి డా ఎన్ వరుణ్ పర్యవేక్షణలో కోటబొమ్మాలి మండలం కొత్తపల్లి మరియు కురుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 68 మంది విద్యార్థులకు ఉచిత కళ్లద్దాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. జి గురుమూర్తి మాట్లాడుతూ దృష్టిలోపం ఉన్న విద్యార్థులంతా ప్రతి ఏడాది కంటి పరీక్షలు నిర్వహించుకొని కంటి అద్దాలు అవసరమైతే ప్రతినిత్యం ధరించి కంటి చూపును కాపాడుకోవాలన్నారు. తదనంతరం వైద్యాధికారి మరియు ప్రధానోపాధ్యాయులు కె శాంతకుమారి కళ్లద్దాలు పంపిణీ చేశారు. కురుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎం కృష్ణారావు చేతుల మీదుగా 45 మంది విద్యార్థులకు కళాద్దాల పంపిణీ కార్యక్రమం జరిగింది.
ఆప్తలమిక్ అధికారి ఎం అర్ కె దాస్ విద్యార్థులకు కళ్లద్దాలు ఉపయోగించే విధానం మరియు కంటి ఆరోగ్యం- సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి వి దేవి, ఆరోగ్య కార్యకర్తలు లలిత, కె జగనకుమారి, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు ,విద్యార్థులు పాల్గొన్నారు.

# హిందీ ప్రచార సభ డైరీలను ఆవిష్కరించిన నౌపడా సత్యనారాయణ

- హిందీ డైరీల ముద్రణ ప్రశంసనీయం
- నౌపడా సత్యనారాయణను సత్కరించిన ప్రచార సభ ప్రతినిధులు



**న్యూఢిల్లీ:** గత కొన్నేళ్లుగా హిందీ ప్రచార సభ ఏటా హిందీ దైనందినిలను ముద్రించడం ప్రశంసనీయమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రికి అదనపు కార్యదర్శి నౌపడా సత్యనారాయణ అన్నారు. బుధవారం ఢిల్లీలోని పౌర విమానయాన శాఖ కార్యాలయంలో హిందీ ప్రచార సభ డైరీలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. జాతీయ భాష హిందీ ప్రచారం పవిత్ర కార్యమని సత్యనారాయణ కొనియాడారు. కేంద్ర ఆర్థిక శాఖ హిందీ సలహా మండలి సభ్యులు కోనే శ్రీధర్ మాట్లాడుతూ, హిందీ ప్రచార సభ గత 90 ఏళ్లుగా దక్షిణ భారత దేశంలో జాతీయ భాష హిందీ ప్రచారానికి అంకితమైన సంస్థ అని వివరించారు. ఏపీ న్యూస్ ఎడిటర్ ఎం.వి. మల్లేశ్వరరావు మాట్లాడుతూ, హిందీ ప్రచార సభ సేవలు అమూల్యమైనవని అన్నారు.
విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు వ్యక్తిగత కార్యదర్శి ప్రసాద్ పట్నాయక్, జి.వి. నాగభూషణరావు, ఎం. కళ్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

**నౌపడా సత్యనారాయణకు సత్కారం:**

బహుముఖ ప్రతిభాశాలి నౌపడా సత్యనారాయణను హిందీ ప్రచార సభ, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ తరపున ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కోనే శ్రీధర్, ఎం.వి. మల్లేశ్వరరావులు మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్టుగా, రాజకీయ అనుభవజ్ఞునిగా, తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ కార్యదర్శిగా నౌపడా సత్యనారాయణ సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు.
ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ప్రతినిధులు జివి. నాగభూషణరావు, కళ్యాణ్ చక్రవర్తి, జి. సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి ఐక్యమత్యంతో పనిచేయాలి

భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు బూరె నరేంద్ర చక్రవర్తి

**నవతరం-శ్రీకాకుళం**



భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించబడిన తరువాత మొట్టమొదటిసారి శ్రీకాకుళం జిల్లా పార్టీ కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా బూరె నరేంద్ర చక్రవర్తి కి బీజేవైఎం పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జల రాజు వెంకట్ యువ నాయకులతో కలిసి బాణా సంచాలు కాల్చి , పుష్పగుచ్ఛంతో ఘన స్వాగతం పలకడం జరిగింది. అనంతరం పార్టీ కార్యాలయంలో భరతమాత చిత్రపటానికి పూలమాల వేసి, యువ నాయకులను ఉద్దేశించి, ప్రపంచ దేశాలు మెచ్చిన విశ్వ గురువు ప్రధానమంత్రి నరేంద్ర మోధీ గారి నాయకత్వంలో రాష్ట్ర బిజెపి చీఫ్ పి.వి.ఎన్ మాధవ్ సారధ్యంలో మరియు యువ నాయకుడు బీజేవైఎం రాష్ట్ర రథసారధి సునీల్ రెడ్డి అధ్యక్షతన మన యువ నాయకులందరం పార్టీ బలోపేతానికి ఐక్యమత్యంతో పనిచేయాలి అని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నేను బాధ్యతలు నిర్వహిస్తున్నపటి శ్రీకాకుళం జిల్లాలో పెద్ద ఎత్తున యువకులను పార్టీకి పరిచయం చేసి జిల్లాలో బలోపేతానికి మీ అందరినీ కలుపుకొని పని చేస్తానని, కార్యకర్తలు, నాయకులకి అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని మాట ఇవ్వడం జరిగింది. అనంతరం జిల్లాలో గల జిల్లా మరియు రాష్ట్ర నాయకులను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో యువ నాయకులు గజ్జల రాజు వెంకట్, జాడ అప్పలరాజు, ధనుష్ రంగా, జర్జాన రాంజీ, నాగరాజు, ఉమ, గోపి, తాతారావు, శ్యామ్, తదితరులు పాల్గొన్నారు..

# కిడ్నీ రోగులకు రూ.50 వేల ఇంజెక్షన్లు అందించిన శ్యామలాదేవి

**నవతరం-రాజాం**

పట్టణంలోని గాంధీనగర్‌లో నివసిస్తున్న పూసర్ల నరసింహరావు గారు ఇటీవల కిడ్నీ వ్యాధితో మృతి చెందారు. వారి స్మారకార్థం, కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అవసరమైన రక్తాన్ని పెంచే ఇంజెక్షన్లను వారి భార్య, ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ శ్రీమతి శ్యామలాదేవి, కుమారుడు శరత్ చంద్ర, పుత్రిక హర్షిత కలిసి రూ.50,000 విలువైన ఇంజెక్షన్లను అందించారు. ఈ ఇంజెక్షన్లను రాజాం రెడ్ క్రాస్ అధ్యక్షులు సాయి ప్రశాంత్ కుమార్ గారికి మరియు జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్య కుమార్ గారికి అందజేశారు. రెడ్ క్రాస్ సంస్థ చేస్తున్న సాంఘిక సేవలను కొనియాడుతూ, భవిష్యత్తులో కూడా తమ వంతు సహాయ సహకారాలను అందిస్తామని వారు తెలిపారు. ఈ ఇంజెక్షన్లను శ్రీకాకుళం జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ పి. జగన్మోహన రావు గారికి అందజేస్తామని రాజాం రెడ్ క్రాస్ అధ్యక్షులు సాయి ప్రశాంత్ కుమార్ గారు మరియు పెంకి చైతన్య కుమార్ గారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కొల్లి అప్పలనాయుడు, సత్యసాయి మందిరం మానం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**